# ఒకటీ రెండూ రెండూ ఒకటీ

ఆదివారం గనక మరి రెండు ముద్దలు ఎక్కువ తిని, శాస్త్ర భుక్తాయాసంతో నడుం వాల్చాను. చేతిలో వున్న సండే హిందూ చూస్తూనే చిన్న కునుకు తీశాను. కునుకు పట్టిందో లేదో దేవిగారు అందుకుంది: "పగటినిద్ర మంచిది కాదని శ్రీరంగనీతులు చెబుతారే!"

"నువ్వు వారానికి ఆరురోజులు పగలు నిద్రపోయి, ఆదివారం ఒక్కరోజూ మానేస్తావ్. నేను ఆరురోజులు చాకిరీ చేసి ఆదివారం ఒక్కరోజూ కొద్దిపాటి విశ్రాంతి తీసుకుంటాను."

"మహా చెప్పొచ్చారు. టేబుల్ ముందుకూచుని సంతకాలు పెట్టడంకూడా ఒక చాకిరియే!"

"పోన్లెద్దూ—ఒక నెల్లాళ్ళపాటు నువ్వు నా ఉద్యోగం చెయ్యి; నేను ఈ యింటిపని చూసుకుంటూంటాను."

"వస్తుంది లెండి—ఆ రోజూ వస్తుంది," అని శాంతాదేవి నన్ను బెదిరిస్తూండగా ఎవరో వీధితలుపు తట్టినట్టయింది.

శాంత తలుపుతీసి వచ్చింది-ఆమె వెనకాలే ప్రత్యక్షం—ఒక పళ్ళబుట్టతో సుమతి.

"ఓ—ఎప్పుడొచ్చారు?" అన్నాను.

"ఇవ్వాళ పొద్దుటే" అంది సుమతి.

సుమతి బావగారైన ముకుందంగారు సుమతీ, సుమతి అక్కగారూ, వాళ్ళపిల్లలూ వేసంగి సెలవులకని కోనసీమ వెళ్ళినప్పుడే, ఒక సాయంత్రంవేళ పిచ్చాపాటీ మాట్లాడు కునేందుకని మా యింటికి వచ్చి, మడతమంచాల పేటన పెట్టారు. ఆయన మాట నమ్మకు. నేను అష్టకష్టాలుపడి, మడతమంచాలు కొనేటప్పటికి, అందులో ఒకటి పొట్టీ, మరొకటి పొడుగూ అవడమేగాకుండా, మంచాలు రెండూ మ్యూజికల్ కాట్స్ అయి పూరుకున్నాయి. (అవి కర్రూ బుర్రూ చేసే శబ్దానికి మ్యూజిక్ అను పేరుపెట్టింది శాంత.)

ఎందుకో సుమతిని చూడగానే మడతమంచాల కథ యావత్తూ జ్ఞాపకం వచ్చింది. ఆ విషయం పైకి అంటే బావుండదు. తరువాత స్థిమితంగా వాళ్ళూ వాళ్ళూ చెప్పు కుంటారు. అందుకని ఆ సంగతిని మెదడులోని లోపలి పొరుగుల్లోకి తరిమేసి, 'బావగారు ఊళ్ళో ఉన్నారా? సమ్మర్ ఎలా గడిపారు? మీ స్కూలు ఏ తేదీన తెరుస్తు న్నారు? మీరు జరిపించడానికని వెళ్ళిన వివాహ మహో త్సవం, లాంఛనాల దగ్గిర పేచీలు లేకుండా, యథావిధిగా జరిగిందా?' యిత్యాది లోకాభి రామాయణపు విషయాలు యిద్దరమూ సుమతి టీచరుని అడిగాం; ఆమె నవ్వుతూ తుళ్ళుతూ అమలాపురం ఖబుర్లు ఎన్నెన్నో చెప్పింది.

''శాంతా, చెబితే నమ్మవుగాని అక్కడ వున్న నెలా పదిహేనురోజులూ రోజుకి రెండూ మూడూ చొప్పున

కొబ్బరి బొండాలు తాగేవాన్ని. మన బాదంఖీర్లూ, రోజ్ మిల్కులూ ఎందుకు పనికొస్తాయి ఆ కొబ్బరి నీళ్ళముందు ? పనసతొనలూ, పుచ్చకాయలూ చెప్పనే అక్కర్లేదు మామిడిపళ్ళు—ఎన్నిరకాల మామిడిపళ్ళు అనుకున్నావ్ ! సువర్ణరేఖ, జహాంగీర్, మల్గోవా, చిన్నరసం—ఏమి టేమిటో పేర్లు చెప్పేవారు.'' ఊపిరి పీల్చుకునేందుకు క్షణ కాలం ఆగింది సుమతి.

''శాంతా, సుమతి చూపువాసి లావు అయిందికదూ ?'' అన్నాను.

''అందుకే మీకు మాట్లాడటం చేతకా దంటాను. లావయారని—ఆడవాళ్ళని అనకూడదు. మునుపు సన్నగా వుండేవారు; యిప్పుడు నాజూకుగా ఉన్నారు-అని అనాలి,'' అని శాంత నన్ను గదమాయించింది.

ఊపిరి పీల్చుకోవడం అయిన సుమతి, 'సరి—సరి, నేను రెట్టింపు అయానని మా బావ అంటూంటే...ఇంకా ఈయన మంచివారు గనక 'చూపువాసి' అన్నారు,' అని నావైపు పలికింది.

సుమతి పళ్ళబుట్టలోని బంగినిపల్లి మామిడిపండు ఒకటి తీసి, చెక్కుతీసి, ముక్కలుకోసి, మాయిద్దరికీ పెట్టింది. పండు చాలా రుచిగా ఉంది. ఈ మధ్యకాలంలో అంత మంచి పండు తినలేదంటే తినలేదని నేనూ శాంతా యిద్దరమూ అనుకున్నాం.

టీ తాగుతున్నప్పుడు కాబోలు శాంతాదేవి సుమతిని అడిగింది : 'అంతా బాగానే ఉంది. ఎంత తిన్నా, యిరవై నాలుగు గంటలూ తింటూ కూచోవుకదా! టైము ఎలా గడిపేదానివి! చాలా పుస్తకాలు చదివా వన్నమాట ఈ వేసంగులలో.'

"ఎబ్బే—పుస్తకాలా ? పుస్తకం ముట్టుకుంటే వొట్టు."

"మరి—టైము ఎలా స్పెండ్ చేసేదానివి."

"ఒకటీ రెండూ, రెండూ ఒకటీ," అంది సుమతి.

చిన్నప్పు డెప్పుడో మర్చిపోయిన 'క' భాష జ్ఞాపకం వచ్చి, సుమతి ముఖంలోకి సూటిగా చూశాను. ఆమె తన స్నేహితురాలి వంక చూస్తోంది.

"ఒకటీ రెండూ, రెండూ ఒకటీ—అదేమి ఆట ? గవ్వ లాటా, గచ్చకాయ లాటా, చింతపిక్కలా, చీట్లా? ఏమిటా ఆట ? అలాంటి ఆట నేనెప్పుడూ వినలేదే ?"

"మీరు విన్నారా ?" అంది సుమతి నన్ను వుద్దేశిస్తూ.

"బావుంది—ఈక్వైజ్ ప్రోగ్రామ్! ఒకటీ రెండూ, రెండూ ఒకటేనా ?" అన్నాను.

"అవును," అంది సుమతి.

"రెండూ ఒకటీ, ఒకటీ రెండూ కూడానా ?"

"అవును," అంది సుమతి మళ్ళీ.

"రెండూ రెండూ, ఒకటీ ఒకటీ కూడానా ?"

"అవును" అంది సుమతి, ఈ సారి నవ్వుతూ.

"ఒకటీ ఒకటి, రెండూ రెండు కూడానా ?" అని నేను అనబోతుండగా శాంత అడ్డుపడి, 'ఇక మీరు ఊరుకోండి' అని నన్ను ఆజ్ఞ పెట్టింది.

సుమతి తను వేసంగి సెలవులు ఎలా గడిపిందో అప్పుడు చెప్పింది.

*    *    *    *

క్రాస్ వర్డ్సు, స్క్వేర్ వర్డ్సు, సింపిల్ వర్డ్సు, మైన వర్డ్సు, స్ట్రియిట్ వర్డ్సు-ఇలా రకరకాల వర్డ్సు ఎలా ఉన్నాయో, అలాంటిదే కామినీ వర్డ్సు. కామినీ వర్డ్సు వారు ప్రతి నెలా ఒక లక్షరూపాయిలు పంచి పెడతారు.

ఆ పజిల్ పూర్తి చేసేందుకు మీకు ఇంగ్లీషు భాష రానక్కరలేదు. రాయడం, చదవడం వస్తే సరే సరి.

రాకపోయినా ఫరవాలేదు. ఎటొచ్చీ, ఒకటీ, రెండూ అంకెలు మీరు వేయగలిగి వుండాలి.

ఒకవేళ అది రాకపోయినా కూడా యిబ్బంది లేదు.

మీ మాతృభాషలో మీకు సంతకం పెట్టడం వస్తే చాలు. ఒకవేళ అదీ రాదనుకోండి. అప్పటికీ మించిపోయిన దేమీ లేదు.

మీకు శ్రీకారం చుట్టడం చేతకాకపోయినప్పటికీ, కామినీ వర్డ్సు వారు ప్రతి నెలా పంచిపెట్టే లక్షరూపాయిలూ పొందడానికి ఏ మాత్రం అనర్హులు కారు. మీ మమిక్కిలి కామినీ వర్డ్సులోని ప్రథమ బహుమతులు రిక్షావాళ్ళకీ, రైల్వే పోర్టర్లకీ, రైతు కూలీలకీ లభించినట్టు అనేక నిదర్శనము

లున్నాయి. మనం కట్టేది ఒక్క రూపాయి; మనకి వచ్చేది లక్ష రూపాయిలు.

"మీరు ఈ పజిల్స్‌ని యింత సీరియస్‌గా ఎలా తీసుకో గలిగారు ? ఇదొక మాదిరి జూదం," అన్నాను సుమతితో.

"అదేమో నాకు తెలియదు—జూదమో గీదమో ! మా మేనత్తకొడుక్కి రు. 62-11-0 మనియార్డరు రావడం నేను కళ్ళారా చూశాను. బహుమతి సొమ్ము 20వ తేదీన మనియార్డరు పంపుతామని రాశాడు. 21వ తేదీన మని యార్డరు ఠంచనగా వచ్చింది," అంది సుమతి.

"అయితే, నువ్వెంత తగలేశావ్ ఈ కామినీ కోసం ?" అని ప్రశ్నించింది శాంతాదేవి.

"నెలకి అయిదురూపాయిలని కేటాయించాను. ఎంత మంచి కాలక్షేపం అనుకున్నావ్ ! ఒక పజిల్ అయి పోగానే మరొక పజిల్. దీనిలో రాకపోతే, పై దానిలో రాకపోతుందా—అని ఆశ. మొత్తంమీద భలే తమాషాగా ఉంటుంది. ఏవేవో ఆశలు పురివిప్పి నాట్యం చేస్తున్న ట్టుంటాయి."

"ఇంతోటిదానికి కవిత్వం కూడానా ?" అని నవ్వేసింది శాంతాదేవి ఆ పూటకి.

*　　　*　　　*　　　*

ఆ పూటకని కొసముక్క ఎందుకు అన్నానంటే, శాంతా దేవిలాంటి వాళ్ళు సులువుగా డబ్బు వస్తుందనే ఆశనించి, మనసుని ఒక పట్టాన మళ్ళించుకోరు. నూటికి తొంభయి

మంది కష్టపడకుండా ధనరాసులు కురవాలని కలలుకంటూ వుంటారు. ఆ కలలలోనే వాళ్ళ కాలం గడిచిపోతుంది. బంగారు మేడలన్నీ చెదలు బింకువులతో కట్టినవేనని మనుషులెందుకనో మర్చిపోతారు. అదృష్ట దేవతకి నికరాన్ని నమ్ముకోవడం కంటె, ఉన్నదానితో సరిపెట్టుకోవడంలో హాయి ఉందనుకుంటాను.

ఆడవాళ్ళకే అదృష్టంమీద ఎక్కువ విశ్వాసమో, లేక శాంతాదేవిలాంటి వాళ్ళకేనో నేను చెప్పలేనుగాని, ఎప్పుడయితే సుమతి ఒక రూపాయి మనచేతిది వొదిలించుకుంటే, లక్షరూపాయిలు రాగల అవకాశం ఉందని అన్నదో అప్పుడే అనుకున్నాను—శాంతాదేవి యిటువంటి సదవకాశాన్ని చేతులారా విడిచిపెట్టదని! రెండురోజులు గడిచేటప్పటికి మా యింటినిండా కామినీ వర్డ్సు కాయితాలే! ఆ కాగితం మీద కూపనూ, నిబంధనలూ, మొదలుగాగల వివరాలు ఉన్నాయి. మొత్తం క్లూస్ యిరవై. ప్రతి క్లూకి రెండేసి జవాబులు. మొదటి జవాబు రైటో, రెండవజవాబు రైటో కూపనులో రాయాలి. అలా యిరవై క్లూస్‌కీ యిరవై జవాబులు (1 లేక 2) పూరించి, ఎంట్రీకి ఒక్కొంటికి రూపాయి చొప్పున ప్రవేశరుసుము మనియార్డరు ద్వారా గానీ, ఇండియన్ పోస్టల్ ఆర్డరుద్వారాగానీ, కామినీ వర్డ్సు వారి కాష్‌వోచర్ ద్వారాగానీ చెల్లించి, కూపనుమీద తుడుపులూ, సిరా మరకలూ లేకుండా చూసి పంపాలి,

"చూడండి—మనవాళ్ళే మనని ప్రేమిస్తారా, ద్వేషిస్తారా?" అని అడిగింది శాంతాదేవి. ఆ 'ఏ' కారం దగ్గిర దీర్ఘంతో.

"మంచిపని చేస్తే ప్రేమిస్తారు; వెధవపని చేస్తే ద్వేషిస్తారు," అన్నాను.

"పాము చావకుండా, బడితె విరక్కుండా, చెప్ప కూడదు."

"నన్ను వేధించకు, నీ తంటాలు నువ్వు పడు." అన్నాను.

పది నిముషాలపాటు నన్ను స్థిమితంగా వుండనిచ్చి మళ్ళీ అందుకుంది, శాంత: "రాజకీయ నాయకులే దీనిని తీసుకు రాగలరు. దేనిని? యుద్ధము—శాంతి, వీటిలో దేనిని?"

"రెండిటిని."

"అలా కాదు. ఒకటో రెండో చెప్పాలి."

"అది నా చేతకాదు. మిడతంభొట్లు శకునం ఒకసారి చెప్పగలం, రెండుసార్లు చెప్పగలం. ఇరవైసార్లు చెప్ప గలగడం అసంభవం," అన్నాను.

అనుకోకుండా ఆ సాయంత్రం వేళ సుమతి వచ్చింది, 'శుభవార్త, శుభవార్త' అంటూ.

గుడ్ న్యూస్ అంటే అంత యిబ్బంది పడివుండే వాళ్ళం కాదుగాని, దాన్ని కాస్తా శుభవార్తగా తెలుగుజెయ్యడంతో, విషయమేమిటో తెలియక వుక్కిరిబిక్కిరయాం.

"'మీకో మంచిమాట చెబుతాను' అని అనక, అచ్చు గ్రాంథికంలో 'శుభవార్త' అంటావేమిటె? టీచరువి అయి

ఎందుకు ఆ గాలి పోనిచ్చుకో లేదు,'' అంది శాంతా దేవి తన ఫ్రెండుని మందలిస్తూ.

సుమతి మహా సంతోషంగా ఉంది. 'కామన్‌వెల్త్‌ను 84 లో నాకు ఒక్కటే తప్పు వచ్చింది. రన్నర్స్ అప్‌లో తప్పక ఉంటాను.''

''ఆల్ కరెక్ట్ లేకపోతే మొదటి బహుమతి నీదేగా ఎంత ? రు 65,000,'' అంది శాంతా దేవి.

''ఆల్ కరెక్ట్ ఉండకుండా ఎందుకుంటుంది ? ఆల్ కరెక్ట్‌వే పది పన్నెండు ఉంటున్నాయి ఈ మధ్య. ఒక తప్పువి డెబ్భయి ఎనభై దాకా ఉంటాయి. సుమారు ఒక వంద రూపాయి లొస్తుంది.''

''ఇంతే—ఇంతా కష్టపడితే!'' అని పెదవి విరచింది శాంతా దేవి.

''ఆహా—మీ కష్టమే చెప్పాలి. ఒకటీ రెండూ, రెండూ ఒకటీ—చేతికొచ్చినట్లు ఏదో ఒకటి వెయ్యడంకూడా కష్ట మేనా ?'' అన్నాను నేను వూరుకోలేక.

''అలా ఎలా కుదురుతుందండి ? క్లూస్‌ని శ్రద్ధగా పరీక్షించాలి,'' అని సమర్థించ బోయింది సుమతి.

''కామన్‌వెల్త్‌సువారు యింటర్‌వ్యూకి వచ్చినప్పుడు మీరు ఆ మాటలు చెబుదురుగాని—నాకెందుకు చెబుతారు ?'' అన్నాను.

"సుమతీ, ఆయనకి ఈ పజిల్స్ అంటే మహా వేళా కోళంగా ఉంది," అంది శాంత.

"శాంతా, నేనొక మంచిపద్ధతి చెబుతాను. రాజూ, మంత్రీ, బంటూ, దొంగ చీట్లుగా రాసి చిన్నపిల్లలు ఆడు కుంటారే, అలా పది చీట్లమీద ఒకటి, పది చీట్లమీద రెండూ రాసి, మొత్తం చీట్లు మడిచి, వాటిని కలగా పులగం చేసి యిరవై చీట్లు ఒక్కటొక్కటే తీసి, ఆ ప్రకారం ఎంట్రినీ నింపు తేసరి, ఇదా, అదా అని మథనపడే కంటె నేను చెప్పేది శ్రేష్ఠమైనపద్ధతి. అదృష్టదేవతని పలకరించేం దుకు యిదే మార్గం."

"ఊరుకోండి—మరీ చెబుతారు!" అని శాంతాదేవి నన్ను ఆ పూటకి కసురుకున్నప్పటికీ, చిట్టచివరికి నేను చెప్పినపద్ధతే అవలంబించింది.

శాంతేమో యిరవై చీట్లూ మా పసిపిల్లచేత తీయి స్తోంది, సుమతేమో—వాళ్ళ అక్కగారి కూతురిచేత,—వెనక మహాబలిపురంలో తప్పిపోయిందే ఆ అమ్మాయిచేత—తీయి స్తోంది. ప్రతినెలా సుమతి అయిదూ, శాంతాదేవి పదీ చొప్పున కామినీవర్డ్సు వారికి కట్నం చదివిస్తూ, అదృష్ట దేవత రాకకోసం ఎదురు చూస్తున్నారు. చూడనివ్వండి— ఏం చేస్తాం! ఒకళ్ళ కొకళ్ళు సాయం. ఒకటీ రెండూ, రెండూ ఒకటీ! అదృష్టమంతా ఆ రెండు అంకెలలోనే ఉంది.